సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న కూలీలు

పారని అమృత్

- పురపాలికల్లో ముందుకు సాగని పనులు
- తప్పని నీటి కష్టాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటింటికీ తాగునీటి కుళాయి పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ రెండో దఫా పనులు పూర్తికాకపోవడంతో ఎంపిక చేసిన పురపాలికల్లో నీరు పారడం లేదు. దీంతో ఆయా పురపాలికల వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు...

పురపాలికల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింది ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని మున్సిపాలిటీ, నంద్యాల మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. వాటిల్లో రెండో దఫా అమృత్ పథకం పనులు ముందుకు సాగడం లేదు. ఈ పనుల కోసం 2023 జనవరిలో ఒక సారి, మే నెలలో మరో సారి కేంద్రం పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిపిఆర్ తయారు చేయించి, సాంకేతిక అంశాలు దాటించి, టెండర్ కోసం ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం అయ్యారు. దీంతో ఆయా పురపాలికల్లో పట్టణ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కర్నూలు నగరంలో రోజుకు 180 ఎంఎల్‌డి నీరు అందించాలి. ప్రస్తుతం 35 ఎంఎల్‌డికి మించి నీటిని సరఫరా చేయడం లేదు. పథకాల నిర్వహణలో సమస్యలు, నగరంలో విలీన గ్రామాలతో జనాభా పెరగడం, తదితర కారణాలతో నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో రూ.115 కోట్లతో అమృత్ కింద పనులు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. జగనాథ గట్టు ప్రాంతంలో నీటి శుద్ధి కర్మాగారం, నగరంలో 22 ఉపరితల నీటి ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వాటికి అడుగులు ముందుకు పడలేదు. ఆదోని పట్టణంలో ప్రస్తుతం సగం వార్డులకు రెండు రోజులకోసారి, మిగిలిన వార్డులకు మూడు నాలుగురోజులకోసారి నీటిని అందిస్తున్నారు. రోజూ 25 ఎంఎల్‌డి నీటిని ఇవ్వాల్సి ఉండగా 22 ఎంఎల్‌డి నీటిని ఇస్తున్నారు. లీకేజీల కారణంగా మరో పది శాతం నీరు వృథా అవుతోంది. సీజన్‌తో నిమిత్తం లేకుండా నీటి సమస్యలతో ఆదోని పట్టణ వాసులు సతమతమవుతున్నారు. ప్రధానంగా శివారు కాలనీల విస్తీర్ణం పెరుగుతోంది. అందుకు తగ్గట్లు నీటిని అందించలేకపోతున్నారు. అమృత్ కింద రూ.35.17 కోట్లతో ప్రణాళిక రచించారు. ఇందులో రూ.12.90 కోట్లుతో శివారు ప్రాంతాల్లో నీటి అవసరాలు తీర్చేందుకు, రూ.22.27 కోట్లు నీటి వనరులు పెంచుకోవాలనుకున్నారు. ఆ పనులకు అడుగులు ముందకు పడలేదు. అమృత్ పథకం కింద నంద్యాల మున్సిపాలిటీలో రూ.174 కోట్లతో ఐదు పనులు చేపట్టాలనుకున్నారు. నగరంలో 42 వార్డులు ఉన్నాయి. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. రోజు 26 నుంచి 28 ఎంఎల్‌డి నీటిని అందించాలి. 24 ఎంఎల్‌డికి మించడం లేదు. గతంలో చేపట్టిన అమృత్ పనులు కొంత మిగిలి ఉండటం ఒకింత సమస్యగా మారింది. ప్రస్తుతం వెలుగోడు నుంచి నీరు తీసుకుంటున్నారు. గోరుకల్లు నీటి నుంచి అవసరాలు తీర్చాలనే దిశగా యోచిస్తున్నారు. అమృత్ రెండో దఫా పనులు పూర్తయితే భవిష్యత్తు 40 ఏళ్ల వరకు నీటి సమస్యలు రావనేది అధికారులు అంచనా వేశారు. అమృత్ పనులు పూర్తికాకపోవడంతో ఆ ఆశయం నెరవేరడం లేదు.

ఎన్నాళ్లు అర్ధాకలి..?

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్
- పనులు కల్పించాలంటూ నెత్తిన తట్టతో ర్యాలీ
- ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

ప్రజాశక్తి - ఆదోని

పనుల్లేక ఊళ్లకు ఊళ్లే ఖాళీ అవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, అర్ధాకలితో ఎన్నాళ్లు బతకాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆదోని పట్టణంలోని భావసార కల్యాణ మండపంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న అధ్యక్షతన ఉపాధి కూలీలకు పనులు కల్పించాలంటూ సదస్సు నిర్వహించారు. సిఎల్‌ఆర్‌సి ఏపీడీ కృష్ణ మోహన్, ఆదోని క్లస్టర్ ఏపీడీ లోకేశ్వర్ హాజరయ్యారు. అనంతరం సదస్సు జరిగిన చోటు నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మున్సిపల్ రోడ్డు మీదుగా 'పనులైన కల్పించాలి. లేదా ఆకలైన తీర్చాల'ంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తలపై తట్ట ఉంచుకొని ఖాళీ బుట్టలతో నాయకులు, వ్యవసాయ కూలీలు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మధ్యాహ్నం మండుటెండలో ర్యాలీ చేపట్టారు. అక్కడ నిరసన చేపట్టి ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చేయడానికి పనుల్లేక లక్షలాదిమంది నిత్యం వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసలను నివారించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా వీసీ, టీసీ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. జిల్లాలోని ఆదోని ప్రాంతంలో వలసలు నివారించాలంటే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, పరిశ్రమలు స్థాపించాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టంలో రాజకీయ జోక్యం మితిమీరిపోవడంతో, కూలీలకు ఉపాధి పనులు కల్పించలేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వలసలు వెళ్తున్నారని తెలిపారు. రాజకీయ జోక్యం నివారించడానికి ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఈ.తిక్కన్న, డి.రామంజినేయులు, బి.నాగన్న, బి.బాలకృష్ణ, శ్రీరాములు, సురేంద్ర, సిఐటియు సీనియర్ నాయకులు మహా నందిరెడ్డి, లక్ష్మన్న, పిఎస్.గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, వీరేష్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

26న రైతు సంఘాల ర్యాలీ

- రైతు సంఘా సమన్వయ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతు, కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కెకె భవన్‌లో శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు సాగించిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందన్నారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాల్లోని విధానాలతోనే తిరిగి చట్టాలను తీసుకువస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకు చేసినవేనన్నారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్య సహకార సంఘాలను మొత్తం కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందకి చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. సహకార వ్యవస్థలన్నీ కంపెనీల హస్త గతం అవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన వ్యవసాయ మార్కెట్లు జాతీయ విధానం చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాదారిత పరిశ్రమాధిపతులు ఎగుమతి దిగుమతులు దారులు, విదేశీ వ్యాపారులు రైతు పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం నిలువ చేసుకోవడం ఎగుమతి చేసుకోవడం అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. కావున రైతులు వ్యవసాయ కార్మికులు కౌలు రైతులు కార్మికులు ఈనెల 26న ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, కెజిబివిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ రైతు సంఘం నాయకులు మధు, కృష్ణ, రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సాయి ఉదయ్, అబూబకర్, ఎల్లా గౌడ్ పాల్గొన్నారు.

వికసిత కర్నూలుగా తీర్చిదిద్దాలి

- '20 సూత్రాల' ఛైర్మన్ లంకా దినకర్
- అధికారులతో విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వికసిత కర్నూలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి పెట్టాలని 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం లో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలుపై 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంక దినకర్ జిల్లా అధికారులతో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్ బాష, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల బాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరుచరిత, కెఇ.శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, బికె పార్థసారథి, విరుపాక్షి పాల్గొన్నారు. ఛైర్మన్ దినకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధన -2047 లక్ష్యంగా ఒక విజన్‌తో పని చేస్తున్నారన్నారు. వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్రను భాగ్యస్వామ్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, అభివృద్ధే తారక మంత్రంగా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పేదలకు పనులు కల్పించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 29 లక్షల పని దినాలను కల్పించి లక్ష్యాలను సాధించాలని ఛైర్మన్ డ్వామా పిడిని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో సగటున ఒక్కో కుటుంబానికి 35 పని దినాలు కల్పించారన్నారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు పెండింగ్‌లో ఉన్న రూ. 52 కోట్లు 70 రోజులలో ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడిని ఆదేశించారు.. పెండింగులో ఉన్న పశువుల షెడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచి నీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. 3,45,790 హౌస్ హోల్డ్స్‌కు గాను 1,96,658 ఇళ్లు పూర్తి చేశారని చెబుతున్నారని, ఏపీ నియోజకవర్గాల్లో ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారని వివరాలు ఇస్తే వెళ్లి చెక్ చేసి వాటి ద్వారా నీళ్లు వస్తున్నాయో లేదా అని పరిశీలిస్తామన్నారు. కేవలం ట్యాప్‌లు బిగిస్తే పనులు పూర్తయినట్లు కాదని ఛైర్మన్ పేర్కొన్నారు. 100 శాతం ప్రతి ఇంటికి నీరు సరఫరా అయ్యే విధంగా అసెస్‌మెంట్ జరగాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చేందుకు నిధులను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఎస్ఇ ఛైర్మన్ దృష్టికి తీసుకొని రాగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని ఛైర్మన్ తెలిపారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన, కరెంట్, నీరు, రోడ్లు మాత్రమే కాదని ముఖ్యంగా అక్కడ ఉండే లబ్ధిదారులకు రవాణా సదుపాయం ఉండాలని, దగ్గరలో పాఠశాల, వైద్యశాల ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను పక్కాగా అమలు చేసేలా చూడాలని కోరారు. నిధుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జెసి బి.నవ్య, ఇన్‌చార్జి డిఆర్ఒ బికె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకరన్

కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-పత్తికొండ

రైతులు పండించిన కందులను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని , కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనం నుండి సిపిఎం నాయకులు ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా చేశారు. సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సుమారు పదివేల ఎకరాలలో కంది పంటను రైతులు సాగు చేశారని అన్నారు. రోజురోజుకు కందులధర పతనం కావడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర రూ.7,550 తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రైతులను కలుపుకొని ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ,రైతులు పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, చక్రాల రాజేశ్వర్ రెడ్డి, నారాయణ, సిఐటియు సెక్రెటరీ గోపాల్ ఆటో వర్కర్స్ నాయకులు మహబూబ్ బాషా, సుకప్ప పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు

దళితులను హత్య చేసిన ముద్దాయి బిజెపి అధ్యక్షుడా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: కౌతాళం మండలం కామవరం గ్రామంలో 2022 జనవరి 27న దళితులపై పట్టపగలు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముద్దాయిగా ఉన్న రామకృష్ణను బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం బిజెపి నైతికతకు నిదర్శనమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు విమర్శించారు. గురువారం కర్నూలు బుధవార్ పేటలోని కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా మాజీ అధ్యక్షులు ఎం.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణతో కలిసి ఆనంద్ బాబు మాట్లాడారు. దళితులపై జరిగిన కిరాతకమైన హత్య ఘటనలో ముద్దాయిగా ఉన్న వ్యక్తి తప్ప బిజెపికి వేరే నాయకులు జిల్లా అధ్యక్షులుగా పెట్టడానికి దొరకలేదా అని వారు ఎద్దేవా చేశారు. హత్య ఘటనలే కాదు, అనేక అసాంఘిక కార్యక్రమాలు మట్కా లాంటి వాటితో కూడా సంబంధం ఉందని ప్రచారం జరుగుతున్న వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించారన్నారు. మతసామరస్యానికి, కుల మత సోదర భావానికి ప్రతీకగా ఉన్న కర్నూలు జిల్లాను ఏమి చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ఒకవైపు పార్లమెంటు సాక్షిగా దేశానికి హోం మంత్రిగా ఉన్న అమిత్‌షా అంబేద్కర్ అవమానించారన్నారు. దేశంలో ఉన్న నిమ్న కులాలు అందరికీ హక్కులను ప్రసాదించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్న క్రమంలో కర్నూలు జిల్లాలో కూడా దళితులపై జరిగిన హత్యాకాండలో భాగం పంచుకున్న రామకృష్ణను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం, బిజెపి కుటిలనీతి అర్థమవుతోందన్నారు. వెంటనే రామకృష్ణను బిజెపి అధ్యక్షుడిగా తొలగించి మరో వ్యక్తిని బిసి సామాజిక తరగతి నుండే జిల్లా అధ్యక్షులుగా నియమించాలన్నారు. ఇప్పటికైనా బిజెపి మాయలో ఉండే దళితులు, బడుగు బలహీన వర్గాలు గమనించి ప్రశ్నించాలని వారు కోరారు.

వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా నారాయణ దాసు

బిసిసెల్ అధ్యక్షులుగా చక్రాలశ్రీరాములు

ప్రజాశక్తి-పత్తికొండ

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పత్తికొండ వైసిపి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం పత్తికొండ నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా ఎంపిపి నారాయణ దాసును, వైసిపి బీసీ సెల్ అధ్యక్షులుగా చక్రాల పి. శ్రీరాములును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాపై ఎంతో నమ్మకంగా పదవి బాధ్యతలను అప్ప చెప్పినందుకు వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి కోసం నిరంతరం పని చేస్తానని అన్నారు.

నారాయణదాసు, శ్రీరాములు

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో ఉపాధి అవకాశాలు

రూ ,10 లక్షల విలువచేసే పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ పారిశ్రామిక వాడలో రాబోయే రోజుల్లో జిల్లాలోని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పొందుతారని ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా పేద విద్యార్థులకు రూ.10లక్షల విలువ చేసే పుస్తకాలను స్పెక్ట్రమ్ పబ్లికేషన్ అధినేత సూరినేని మోహన్ నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, జయసూర్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం యూనివర్సిటీ ఆవరణంలో మొక్కలు పెంపకం కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జెఎసి చైర్మన్ శ్రీరాములు, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ నాగరాజు, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, నాగరాజు, హుస్సేన్, వెంకటస్వామి లైబ్రరిన్ నాగభూషణం, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు గౌరుచరిత, దస్తగిరి, ఆర్‌యువిసి

ఎలక్టోరల్ అవార్డుకు కలెక్టర్ రంజిత్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కు 2024 సంవత్సరానికి బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్ లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత ఏడాది బాపట్ల కలెక్టర్ గా 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఎన్నికల కమిషన్ బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్ కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఎంపిక చేసింది.. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురష్కరించుకొని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగనున్న కార్యక్రమంలో కలెక్టర్ ఈ అవార్డును స్వీకరిస్తారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరు కోవాలని ఆరోగ్య కార్యక్రమాలను విజయ వంతం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయములో జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు వాటి ఫలితాలగురించిప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పథకాలను వందశాతం విజయవంతం చేయాలని సూచించారు. సంక్రమిత అసంక్రమిత చికిత్సలు వ్యాధులు నిర్ధారణ చేయించి చికిత్సలు అందించాలని తెలిపారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గర్భ వతులను 12 వారాలలోపు గుర్తించి సమ యాను సారం ఆరోగ్యసేవలు అందించి వాటిని సంబంధిత మొబైల్ యాప్ ఆర్‌సిహెచ్ పోర్టల్‌లోఅప్‌లోడ్ చేయాలన్నారు. బాల్య వివా హాలు చిన్న వయస్సులోగర్భం దాల్చడం వాటి నివారణపై డివిజనల్ స్థాయిలో ఆర్‌డిఒ, డిఐఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఐసిడిఎస్, పోలీస్ శాఖవారితో సబ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా క్షయ నివారణ అధికారిభాస్కర్, జిల్లావ్యాధినిరోధకటీకాల అధికారి నాగప్రసాద్, డిపిఎంఒ డాక్టర్‌ఉమా, గణాం కాధికారి హేమసుందరం, డిపిఒ విజయరాజు, డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణ, డెమో శ్రీనివాసులశెట్టి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

ఆదర్శ గ్రామంగా బి తాండ్రపాడు

రిపబ్లిక్‌డే వేడుకలకు సర్పంచి జయన్నకు ఢిల్లీకి ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామం 2024-25 కు ఆర్థిక సంవత్సరానికి ఆదర్శ గ్రామంగా ఎంపికయింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచి ఆగిపోగు జయన్నకు ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానం లభించింది. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం రాత్రి ఢిల్లీకి పయనమయ్యారు. గ్రామంలో సిసి రోడ్లు కాలువలు తాగునీటి పైపులైన్లు విద్యుత్తు దీపాల ఏర్పాటు తోపాటు గ్రామ ని పరిశుభ్రంగా ఉంచిన నేపథ్యంలో ఆయనకు ఈ ప్రత్యేక గౌరవం దక్కినట్లు తెలుస్తోంది. ప్రజాశక్తి ఆయనను పలకరించింది. ఆయన స్పందిస్తూ తాను గ్రామానికి సర్పంచిగా ఉండడం తన ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి నోచుకోవడం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలోని ఏకైక ఆదర్శ గ్రామంగా గుర్తింపు లభించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రధానంగా టిడిపి జిల్లా సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో, ఎంపి ఎమ్మెల్యేల సహకారం, జిల్లా మండల గ్రామ అధికారుల సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. ఈ గౌరవం దక్కడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర మానవవనరులు, ఐ.టి. ఎలెక్ట్రానిక్స్, విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ జన్మదిన వేడుకలను తెలుగుదేశంపార్టీ కర్నూలు జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కెయి. శ్యాంకుమార్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం నుండి ఎన్. రాఘవేంద్రారెడ్డి, పార్టీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, నాగరాజుయాదవ్, కెవి. సుబ్బారెడ్డి, ఇతర నాయకులతోపాటు అత్యధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. పత్తికొండ నియోజకవర్గం, వెల్దుర్తి మండలం సూదవల్లె గ్రామామానికి చెందిన మర్‌రెడ్డి రమణమ్మ ఆరోగ్య, నిమిత్తం నారా లోకేష్ రూ.4. లక్షల 52 వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారని, ఆ చెక్కును శ్యాంకుమార్, తిక్కారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు ఎన్.అబ్బాన్, బి.రామాంజనేయులు, పద్మలతారెడ్డి, స్వామిరెడ్డి, పార్టీ నాయకులు వెల్దార్తి మండలం జె.వుల్లయ్య, దాసెట్టి శ్రీను, కె.నాగేంద్ర, ఎన్.నవీన్, కె.మహేష్ గౌడ్, జె.తిరుపాల్‌బాబు, ఎన్‌కె.బషీర్, నందిమధు, ఎల్లప్ప, అశోక్, నర్సింహులు, కె.చంద్రకాంత్, గున్నామార్క్, నత్రం రామక్రిష్ణుడుతదితరులు పాల్గొన్నారు.



రూ.4.52 లక్షల చెక్కును చూపుతున్న తిక్కారెడ్డి

ఫోక్సో కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఫోక్సో కేసు కింద నమోదు అయిన కేసును విచారించిన అనంతరం ముద్దాయి దర్గా షేక్షావలికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫోక్సో జడ్జి జి.భూపాల్‌రెడ్డి గురువారం తీర్పు వెల్లడించారు. గోనెగండ్ల మండలం గంజనహళ్లి దర్గాషేక్షావలి పై 2021 ఆగస్టులో ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన అనంతరం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధించారు. బాధితురాలికి రెండు లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జడ్జి తీర్పులో వెల్లడించారు.

భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద గ్రామ రైతుల ఫిర్యాదు మేరకు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ భూములను పరిశీలించారు. గురువారం కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో రీ సర్వే జరిగిన భూములపై వచ్చిన ఫిర్యాదులను గ్రామ సచివాలయంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి రైతుల భూములను పరిశీలించారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మౌర్య భరద్వాజ్

బాల్యవివాహాల నివారణలో
భాగస్వాములు కావాలి : సిడిపిఒ

ప్రజాశక్తి - నందవరం

బాల్య వివాహాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని సిడిపిఒ సఫరున్నీసా బేగం కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సిడిపిఒ సఫరున్నీసా బేగం ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలకు కిశోరి వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ, ఎపిఎం, ఎంఇఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. 11 నుంచి 19 ఏళ్ల బాలబాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. బాల్యవివాహాలు జరగడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మండలం సూపర్ వైజర్లు సుచరిత, సుధావతి, నీలమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

ఘనంగా నేతాజీ జయంతి

ప్రజాశక్తి - కౌతాళం

భారత స్వాతంత్ర్య సమర యోధుడు మాతృభూమి సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహా నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకను ప్రతిభ హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి సమాజ శ్రేయస్సు, దేశ రక్షణ కోసం క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యనభ్యసించి ఒక సైనికుడులాగా ముందడుగు వేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి, జయలక్ష్మి, శిరీష, మమ్ముతాజ్, రాజు, భీమేష్, ఖాజా పీర్, సీనియర్ ఈరన్న పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిబ్బంది

విద్యార్థుల వివరాల సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నట్లు నర్సు ప్రవీణ జ్యోతి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నర్సు ఎం.అమరేశమ్మతో కలిసి విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఆర్‌బిఎస్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్య సమస్యలు, ఎత్తు, బరువు వంటి అంశాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గత సోమవారం నుంచి వివరాల సేకరణ చేపడుతున్నట్లు, ఇప్పటి వరకు 5 సెక్షన్ నుంచి 200 మంది విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నామని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు హంపయ్య, పిఇటి నరసింహ రాజు, ఎఎన్‌ఎంలు వరప్రసాద లక్ష్మి, కల్పన, శైలజ, రత్నమ్మ పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రానికి సప్త నదుల జలాలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం కుంభాభిషేకం కోసం సప్త నదుల నుంచి జలం, విజయ గణపతి విగ్రహం, లక్ష్మీదేవి విగ్రహం, ధ్వజస్తంభం, నవగ్రహ మంటపం, బలిపీఠం ఉరుకుంద క్షేత్రానికి చేరుకున్నాయి. గురువారం దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయ్ రాజు ఆధ్వర్యంలో దేవస్థాన ప్రధాన అర్చకులు, దేవాలయ సిబ్బంది, ఉరుకుంద గ్రామస్తులు మేళతాళాలతో పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీఉరుకుంద ఈరన్న స్వామి వారికి విశేష పూజలు చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, పూజన్న స్వామి, అర్చకులు నాగరాజు స్వామి, ఈరన్న స్వామి, మల్లయ్య స్వామి పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ప్రధాన అర్చకులు

పంచాయతీ యూనిట్‌గా
అభివృద్ధి ప్రణాళిక చేపట్టాలి

- ఎంపిడిఒ మణిమంజరి
- ప్రజా ప్రతినిధుల భర్త, కుమారులకు సర్వసభ్య సమావేశానికి అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంచాయతీలను యూనిట్‌గా తీసుకొని 2025-26 పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక చేపట్టాలని ఎంపిడిఒ మణిమంజరి తెలిపారు. ఈ సంవత్సరంలో మొదటి గోనెగండ్ల మండల సర్వసభ సమావేశం ఎంపిపి నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపిడిఒ మణిమంజరి, తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ... పంచాయతీలను యూనిట్‌గా తీసుకొని నాబార్డు ద్వారా లేదా ఇతర సంస్థల ద్వారా రాష్ట్రం కానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ఏయే పథకాలకు ఎంతెంత వెచ్చిస్తుందో అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని తెలిపారు. ఏ శాఖల్లో ఫలితంగా ఏయే పథకాల ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరుతుందో తెలుస్తుందని చెప్పారు. అనంతరం వ్యవసాయం, విద్య, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, ఆరోగ్య, గృహ నిర్మాణ శాఖ, ఉపాధి హామీ శాఖల అధికారులు తాము చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలను వినిపించారు.

ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు అనుమతి నిరాకరణ

ఈ సంవత్సరపు మొదటి సర్వసభ్య సమావేశానికి ఎంపిడిఒ, అధికారులు, ప్రజాప్రతినిధులు అయిన మహిళా ఎంపిటిసిలు లేదా మహిళా సర్పంచుల కుమారులు లేదా భర్తలకు సమావేశంలోకి అనుమతి నిరాకరించారు. సభ ప్రారంభం కాగానే ప్రజా ప్రతినిధులు కాని వారు ఎవరైనా ఉంటే బయటికి వెళ్లిపోవాలని కోరడంతో గంజిహళ్లి సర్పంచి తోలు లక్ష్మీ కుమారుడు తోలు రాముడు బయటకు వెళ్లిపోయారు.

జడ్‌పి నిధులు వృథా కానివ్వొద్దు : జిల్లా పరిషత్ నుంచి మండల జడ్‌పిటిసి ద్వారా రూ.15 లక్షలు మంజూరయ్యాయని, ఈ మార్చిలోపు సద్వినియోగం చేసుకోకపోతే ఆ నిధులు వృథా అయ్యే అవకాశం ఉందని వైస్ ఎంపిపి వెంకట్రామిరెడ్డి అధికారులను కోరారు. సంబంధిత జడ్‌పిటిసి ద్వారా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తే పనులు చేపట్టి నిధుల సద్వినియోగానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

ఎంపిటిసి రజియా సుల్తానా

జడ్‌పి నిధులపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపిపి

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపును ఆపాలి

- ఎంపిటిసి రజియా సుల్తానా

ఇటీవల కాలంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే చర్యలు చేపట్టారని, వీటిని వెంటనే ఆపాలని గోనెగండ్ల ఎంపిటిసి-1 టి.రజియా సుల్తానా అధికారులను కోరారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే వారిపై మాత్రమే చర్యలు తీసుకోవాలని, మండలంలో క్షేత్ర సహాయకుల తొలగింపును ఆపాలని కోరారు. పనితీరు సక్రమంగా లేని పురోగతి సాధించని వారిపై మాత్రమే చర్యలు ఉంటాయని, అందరిపైనా ఉండవని మండల అధికారులు సమాధానం ఇచ్చారు.

విద్యార్థుల మృతిపై బీవీ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయం వేద పాఠశాల విద్యార్థుల మృతిపై ఎమ్మెల్యే, పిఎసి కమిటీ మెంబర్ డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం సింధనూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వైద్యం కోసం అవసరమైన అన్ని సహాయాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వైసిపి యూత్ తాలూకా అధ్యక్షులుగా అశోక్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరికి చెందిన దబ్బాల అశోక్ కుమార్‌ను వైసిపి యూత్ తాలూకా అధ్యక్షులుగా అధిష్టానం నియమించడం పట్ల పార్టీ శ్రేణులు గురువారం హర్షం వ్యక్తం చేశాయి. 2014 నుంచి పార్టీలో క్రియాశీలకంగా అశోక్ పనిచేశారు. ఆస్పరి గ్రామంతో పాటు స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. అప్పటి ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరామ్‌కు సన్నిహితంగా ఉండడంతో సొసైటీ సిఇఒ పదవిని పొందారు. సొసైటీ సిఇఒగా ఉంటూ రైతులకు రుణాలు ఇప్పించడంలో ఎంతగానో కృషి చేశారు. ఆస్పరిలో పార్టీ కార్యక్రమాలు విజయవంతం కావడానికి తోడ్పడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాలూకాలో మొట్టమొదట సారిగా స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ అధికారంలో లేనప్పటికీ ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. అశోక్ మాట్లాడుతూ... తనకు యూత్ పదవిని ఇచ్చిన అధిష్టానం, ఎమ్మెల్యే విరుపాక్షి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యూత్ విభాగాన్ని పటిష్టం చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - ఆదోని

చదువు పట్ల ఆసక్తి ఉన్న పేద విద్యార్థినికి బ్యాంకు ఉద్యోగులు ఆర్థిక చేయుతనిచ్చారు. పట్టణంలో వైఎస్ఆర్ నగర్ కస్తూరిబా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.శ్రీలతకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. విషయం తెలుసుకున్న పట్టణంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు షరాఫ్ బజార్ బ్రాంచి ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. గురువారం బ్యాంకులో రూ.5 వేల చెక్కును విద్యార్థినికి అందజేసినట్లు బ్యాంకు ఉద్యోగులు తెలిపారు. వారికి విద్యార్థిని శ్రీలత ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థికి నగదు ఇస్తున్న సిబ్బంది

కార్యకర్తకు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శ

ప్రజాశక్తి- హోళగుంద

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్త బోయ దేవన్నను గురువారం ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. మండలంలోని కోగిలతోట గ్రామానికి చెందిన బోయ దేవన్న ఓ దేవరకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురి కాగా, తలకు బలమైన గాయమైంది. కర్నూలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకొని ఆయనను పరామర్శించారు. ఆయన కోలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఎమ్మెల్యే బీవీతోనే వార్డుల అభివృద్ధి

- టిడిపి పట్టణ నాయకులు బందే నవాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వార్డులు అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డితోనే సాధ్యమని టిడిపి పట్టణ నాయకులు బందే నవాజ్ తెలిపారు. ఎమ్మెల్యే బీవీ ఆదేశాలతో రూ.9.50 లక్షలతో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. బందే నవాజ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం హయాంలో వార్డుల్లో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా స్వీకరించి సిసి రోడ్లు, డ్రెయినేజీలు ఇతర అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ప్రధాన రహదారులు, బిటి రోడ్ల నిర్మాణం, ఎన్నడూ లేని విధంగా రూ.లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న టిడిపి పట్టణ నాయకులు

'శిక్షణ కాలానికి రూ.500 ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విశ్వకర్మ శిక్షణ కాలానికి ఆరు రోజులకు రోజుకు రూ.500 ఇవ్వాలని ఎపి చర్మకారుల సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చర్మకారులు పనిచేసే చోటనే వారికి సంపూర్ణ హక్కులు ఇవ్వాలని, మున్సిపల్ పరిధిలో ఉన్న షాపులను చర్మకారులకే కేటాయించాలని కోరారు. పింఛను రూ.6 వేలకు పెంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం చర్మకారులకు ఇవ్వాలని, వారి ప్రయాణ నిమిత్తం బస్సుల్లో, రైలులో సగం చార్జీలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి చర్మకారుల సంఘం నాయకులు సుమాల రాజు, బాబు, మహారాజు, గుంటెప్ప, కాలేబు, భాస్కర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాం

- వైసిపి మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సర్వర్ ఖాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తామని, నియోజకవర్గంలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చి మైనార్టీల విభాగంలో అధ్యక్షులుగా తనను ఎన్నుకున్న పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే బి.విరుపాక్షికి, పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని కె.సర్వర్ ఖాన్ తెలిపారు. గురువారం ఆయన చిప్పగిరిలోని తన స్వగృహంలో విలేకరల సమావేశంలో మాట్లాడారు. పార్టీకి తన వంతు సేవలు అందిస్తున్నందుకు తనకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చినందుకు, తనకు సహకరిస్తున్న వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఏకం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. పార్టీ ఆదేశాలను పాటించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. అలాగే నియోజకవర్గ వైసిపి బూత్ కన్వీనర్‌గా లోకనాథ్, వైద్య విభాగం అధ్యక్షులుగా బెల్డోన రామచంద్రను నియమించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆస్పరి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ఉమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమీక్ష ఉంటుందన్నారు. మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ శివ కుటుంబానికి ఆటో ట్యాక్సీ డ్రైవర్లు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గురువారం స్థానిక ట్యాక్సీ, ఆటో యజమానులు, డ్రైవర్లు చందాల వేసుకొని రూ.35 వేలను శివ తండ్రి సోమన్నకు అందజేశారు. రాజు, నరేష్, గోసి నరసింహ, అంజి, గోకారి, నరసింహ, మాధవరం రఘు, పాపా రాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ శోభారాణి తనిఖీ చేశారు. గురువారం మండలంలోని రచ్చుమర్రి గ్రామం సమీపంలో ఉపాధి పనులు జరుగుతుండగా తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. వలసలను నివారించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. వలసలు వెళ్లకుండా గ్రామంలో ఉపాధి చట్టం ద్వారా కల్పించే 100 రోజుల పని దినాలను అందరూ వినియోగించుకోవాలాలని సూచించారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం ఉపాధి పనులు చేసుకుంటే సొంత ఊరిలోనే కుటుంబ సభ్యులతో ఉంటూ రోజుకు రూ.300 తీసుకోవచ్చని తెలిపారు. అధిక కూలి కోసం పిల్లలతో చదువులు మాన్పించి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరారు. పనులు కావాల్సిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎపిఒ తిమ్మారెడ్డి, ఇసి శ్రీనివాసులు, టిఎ మరుద్వతి పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ రామకృష్ణ పరిశీలించి, హాజరు మస్టర్‌ను తనిఖీ చేశారు. జాబ్ కార్డు లేని వారు ఎవరైనా ఉంటే ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

మంత్రాలయంలో పనులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ


ఆస్పరిలో మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎపిఒ

పాఠశాల కాంప్లెక్స్‌ను కొనసాగించాలి

- విద్యాకమిటీ ఛైర్మన్లు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఇంగలదహాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌ను కొనసాగించాలని ఇంగలదహాల్, ఎమ్‌డి.హళ్ళి, పెద్ద గోనెహాల్ విద్యా కమిటీ ఛైర్మన్లు ఉరుకుందు, కొండయ్య, సునీత, కెసి.తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, విద్యార్థి సంఘం నాయకులు కోరారు. గురువారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1964లోనే 7.65 ఎకరాల విస్తీర్ణంలో హై స్కూల్‌తో పాటు స్కూల్ కాంప్లెక్స్‌ను ఇచ్చారని తెలిపారు. ఇంగలదహాల్ గ్రామానికి ఆర్అండ్‌బి రోడ్డు సౌకర్యం కూడా ఉందని, పాఠశాలలో విశాలమైన గదులు, బాలుర వసతి గృహం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుగుణంగా ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని చెప్పారు. అన్ని వసతులూ ఉన్న ఇంగలదహాల్ పాఠశాల కాంప్లెక్స్‌ను ఎలా తొలగించారని ప్రశ్నించారు. కాంప్లెక్స్ తొలగింపునకు ఎంఇఒ ప్రధాన కారణమని, ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంగలదహాల్ స్కూల్ కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించకపోతే ప్రజలు, యువకులు కలిసి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యా కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు రఫిక్, మహానంది, పంపాపతి, రాజు, ఇబ్రహీం, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాకమిటీ ఛైర్మన్లు

హత్య కేసు నిందితుడు బిజెపి జిల్లా అధ్యక్షులా..?

- మాల మహానాడు రాష్ట్ర నాయకులు మహానంది

ప్రజాశక్తి - ఆలూరు

దళితుని హత్య కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తిని బిజెపి జిల్లా అధ్యక్షులుగా నియమించడం ఏమిటని మాలమహానాడు రాష్ట్ర నాయకులు జి.మహానంది ప్రశ్నించారు. గురువారం ఆలూరులో అయన మాట్లాడారు. కౌతాళం మండలం కామవరం గ్రామంలో జనవరి 27, 2022న దళితులపై పట్టపగలు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో నిందితునిగా ఉన్న రామకృష్ణను బిజెపి జిల్లా అధ్యక్షులుగా నియమించడం బిజెపి నైతికతకు నిదర్శనమని విమర్శించారు. హత్య ఘటనలే కాదని, అనేక అసాంఘిక కార్యక్రమాలు, మట్కా లాంటి వాటితో కూడా సంబంధం ఉందని ప్రచారం జరుగుతున్న వ్యక్తిని అధ్యక్షులుగా నియమించారని తెలిపారు. రామకృష్ణను జిల్లా అధ్యక్షునిగా తొలగించి బీసీ సామాజిక వర్గం నుంచి మరొకరిని నియమించాలని కోరారు. బిజెపి మాయలో ఉండే దళితులు, బడుగు, బలహీన వర్గాలు గమనించి ప్రశ్నించాలని తెలిపారు. ఈ విషయంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి లేఖ రాస్తున్నట్లు చెప్పారు. ఆలూరు తాలూకా కన్వీనర్ భరత్, రామాంజనేయులు, రంగస్వామి, మల్లికార్జున, కృష్ణ పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, పురపాలక కన్వీనర్ రవిచంద్ర యాదవ్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కె.రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. 11వ వేతన సవరణ గడువు ముగిసి 16 నెలలు కావస్తున్నా 12వ వేతన సవరణ ఊసే లేకుండా పోయిందని, వేతన సవరణ కమిటీకి ఛైర్మన్‌ను నియమించాలని కోరారు. ఉద్యోగ ఆర్థిక బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి భీమరాజు, నాయకులు ప్రహ్లాద, ప్రసాద్, సుధాకర్, జయరాం, నిరంజన్ రెడ్డి ఉన్నారు.

భవిష్యత్తు నాయకుడు లోకేష్

- టిడిపి నాయకులు - ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

భవిష్యత్తు నాయకుడు ఆంధ్రప్రదేశ్ ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఆమె నివాసంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలో అనాథలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లోకేష్ ఆలోచన విధానం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు, కష్టకాలంలో ఉన్న పార్టీకి లోకేష్ జీవం పోశారని తెలిపారు. మాజీ ఎంపిపి భర్త మురళీ, మాజీ సర్పంచి కపటి మాధవ్, నాగనాథనహల్లి రవికుమార్, రాఘవరెడ్డి, బైచిగేరి ఓంకార్, రామకృష్ణ, మండగిరి బాబురావు, కపటి మహదేవ, సాధిక్ వలీ, వి.ఎం.గోపాల్, ఖాసీం, జాలమంచి బంగారన్న, గనేకల్ ఎల్లప్ప, మల్లయ్య, బంగారుబాబు, లక్ష్మన్న, జిలాని బాష, అల్తాఫ్, సవారప్ప, విజయ్, చిట్టి, పెసలబండ నరసింహులు, రాజశేఖర్ ఉన్నారు. అలాగే టిడిపి కార్యాలయంలో లోకేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాయకులు రామస్వామి, వీరేష్ ఉన్నారు. అలాగే టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నాయకులు రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి, బుద్ధారెడ్డి, ఫక్రుద్దీన్, రావుఫ్ ఉన్నారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి ఎంబి.వెంకటేష్, నరసింహ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చాకలి గురురాజా, తెలుగు గురురాజా, కందికట్టు రాఘవేంద్ర, ఛైర్మన్ నరసింహులు, మాంద్రి శివ, బళ్లారి రామ్, వెంకట్, ముల్లా హుస్సేని, శేఖర్, రమేష్, డేవిడ్, రాజన్న, మేకల నరసింహులు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి లోకేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి మండల నాయకులు ఎన్‌వి.రామాంజినేయులు, బేతల బడేసాబ్, పూజారి చంద్రశేఖర్, నాయకులు అడ్వకేట్ పోలకల్ వెంకటేశ్వర్లు, ఎన్‌వి.బాబు నాయుడు, మదీన సాబ్, మహేళ రహమతుల్లా, ఎన్‌వి.హరికృష్ణ, మద్దిలేటి, శాంతన్న పాల్గొన్నారు. **దేవనకొండ** టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్రనాయుడు, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, టిడిపి నాయకులు మల్లికార్జున గౌడ్, రాజగోపాల్ గౌడ్, నాగరాజు గౌడ్, అలారుదిన్నె మల్లయ్య, రామారావు నాయుడు, తెర్నేకల్ నాగేష్ పాల్గొన్నారు. **హాలహర్వి**లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, సర్పంచి మల్లికార్జున, నీటి సంఘాల ఛైర్మన్ మల్లప్ప పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని గోతుల దొడ్డి, రాజా నగర్ క్యాంపులో వేడుకలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టిడిపి నాయకులు సురేష్ నాయుడు, అడివప్ప గౌడ్, టిప్పు సుల్తాన్, వెంకటపతి రాజు, సౌద్రి బసవ రాజు, నాగేశ్వరరావు, సిద్ధప్ప, పట్టాభి చంద్ర, రాజానందు, పక్కీరయ్య, చంద్రప్ప గౌడ్ పాల్గొన్నారు. **ఆలూరు**లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిగుండా బాణసంచా కాలుస్తూ భారీ బైక్ ర్యాలీతో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. రక్తదాన శిబిరాన్ని వైకుంఠం దంపతులతో పాటు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు ప్రారంభించారు. అంతకుముందు సాయిబాబా, కోట వీధిలోని సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు బిల్లేకల్ వెంకటేష్, హోళగుంద శేషగిరి, హాలహర్వి జడ్‌పిటిసి లింగప్ప, సర్పంచులు రాజశేఖర్, నాగరాజు, మండల కన్వీనర్లు షేక్షావలీ, విజయభాస్కర్, తిప్పయ్య పాల్గొన్నారు.

ఆదోనిలో అనాథలకు భోజనం వడ్డిస్తున్న కృష్ణమ్మ, కేక్ కట్ చేస్తున్న ఉమాపతి నాయుడు

ఆలూరులో...

దేవనకొండలో

గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కౌతాళంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

హాలహర్విలో

మంత్రాలయంలో

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కర్నూలు

ఓ.ఎస్.నెం.966/2023

ఆర్.పద్మ. ...వాది

వర్సెస్

పి.హరిక్రిష్ణ తండ్రి పి.శివన్న
వయస్సు 52 సం॥రాలు, బిజినెస్,
ఇంటి నెం.49-50ఎ-60, మద్దూరు నగర్. ...ప్రతివాది

దావా సమన్స్

పై దావా నందు వాది, ప్రతివాది ఐన మీపైన దావా బాపతు మొత్తం రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో మీకు ఎన్నిమార్లు సమన్స్ పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు నిమిత్తమై 11-02-2025వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబందించి మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 11-02-2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. నీవు హాజరు కాని పక్షములో నీ పరోక్షములో ఆ వాజ్యమును తీర్మానించబడునని నీకు తెలియజేయడమైది.

(కోర్టు వారి ఉత్తరువుల మేరకు)

వాయిదా తేది : 11-02-2025

ఇట్లు
యం.మోహన్ రెడ్డి,
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు జిల్లా.
సెల్ : 94407 20194